

వైభవం.. మహాకుంభాభిషేకం

తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్విరామంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. -8లో



ఏసీబీ దాడుల కలకలం?

ఏసీబీ అధికారులు బుధవారం దాడి చేయనున్నారనే సమాచారంతో సూళ్లూరుపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఉలిక్కిపడ్డారు. సర్వర్ పనిచేయడం లేదని రిజిస్ట్రేషన్లు నిలిపేశారు. -8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	25
చిత్తూరు	34	25
తిరుమల	30	22
గూడూరు	35	27
నగరి	34	26

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 75,789మంది స్వామివారిని దర్శించుకున్నారు. 27,684 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.4.35 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలగుతున్నారు.

10లోపు పెన్షనర్లు, ఉద్యోగుల ఈకేవైసీ తప్పనిసరి



లక్ష్మీకరరెడ్డి

తిరుపతి అర్బన్ : జిల్లాలోని పెన్షనర్లు, ఉద్యోగులు ఈ నెల 10వ తేదీలోపు ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని డీటీఓ లక్ష్మీకర రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీఎఫ్ఎంఎస్ ఐడీలను ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

అవార్డు గ్రహీతకు అభినందన



అన్నా సాహెబ్‌ను అభినందిస్తున్న సాయిరాం

తిరుపతి కల్చరల్: మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్న షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చీఫ్ సెక్యూరిటీ అధికారి అన్నా సాహెబ్.బి.పరిదేశిని సర్వం శ్రీసాయి సేవాట్రస్ట్ వారు అభినందించారు. బుధవారం ఈమేరకు ట్రస్ట్ వ్యవస్థాపకుడు సాయిరాం, శాస్త్రవేత్త మండాజీ నరసింహాచారి, జోష్ ప్రాపర్టీస్ ఎండీ ఏ.ఈశ్వర్ తదితరులు షిరిడీకి వెళ్లి అన్నా సాహెబ్‌ను ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : జిల్లాలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు అర్హులైనవారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి బుధవారం ఆదేశించారు. 5 నుంచి 9వ తేదీ లోపు దరఖాస్తులు తీసుకోవాలని, 10న పరిశీలించాలని, 11న ఇంటర్వ్యూలు నిర్వహించాలని, 12వ తేదీన ఎంపికైన వారికి సమాచారం అందించాలని కోరారు.

అద్దెకు ఆర్టీసీ స్థలాలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ స్థలాలను అద్దెకు ఇవ్వాలని నిర్ణయించినట్లు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా స్థలాలను దశలవారీగా 15 ఏళ్ల పాటు అద్దెకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఖరారు చేస్తామన్నారు. తొలి దశలో వెంకటగిరి, సూళ్లూరుపేట డిపోల పరిధిలోని స్థలాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని వివరించారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్టీసీ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో చూడాలని కోరారు.

8 నుంచి గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు

తిరుపతి అర్బన్: జిల్లాలోని 69 గ్రంథాలయాల్లో వేసవి సెలవుల సందర్భంగా ఈ నెల 8 నుంచి జూన్ 16వ తేదీ వరకు విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నారు. బుధవారం ఈ మేరకు జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సైనారు మధుబాల మాట్లాడుతూ విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు యోగా, మెడిటేషన్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రామా, నాటికలు, ఇంగ్లిష్ గ్రామర్, చెస్, క్యారమ్స్, సంగీతం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని వివరించారు. వివరాలకు 9912189869 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హెలీప్యాడ్ కోసం స్థల పరిశీలన



సూచనలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఏర్పేడు : ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో హెలీప్యాడ్ కోసం స్థలాన్ని ఎస్పీ పరమేశ్వరరెడ్డి బుధవారం పరిశీలించారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి పలువురు ప్రముఖులు హెలికాప్టర్‌లో నేరుగా ఐఐటీ తిరుపతికి చేరుకునేందుకు వీలుగా హెలీపాడ్‌ను ఏర్పాటు చేయనున్నారు. సీఐ శ్రీహరి పాల్గొన్నారు.

తమ్ముళ్ల బొజ్జలలోకి పేదల ప్లాట్లు

తీగలాగితే డొంక కదిలినట్లు.. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో ఓ చిరుద్యోగి ఇంట్లో సోదాలు చేస్తే మాజీ మంత్రి బొజ్జల అనుచరుల అక్రమాల పర్వం వెలుగుచూసింది. రాజీవ్‌నగర్‌లో నిరుపేదలకు కేటాయించిన స్థలాలను ఇష్టారాజ్యంగా అమ్ముకుని సొమ్ము చేసుకున్న వైనం పట్టణ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో పురపాలక ఉద్యోగి అల్లూరయ్యను అడ్డుపెట్టుకుని కొందరు టీడీపీ నాయకులు యథేచ్ఛగా ప్లాట్లు విక్రయించేశారనే విషయం తెలియడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మాయమాటలు చెప్పి తమ పట్టాలు తీసుకుని ఫోర్జరీ సంతకాలతో తెగనమ్మేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా మరికొందరు పచ్చనేతలు అందినకాడికి స్థలాలను ఆక్రమించుకున్నట్లు ఆరోపిస్తున్నారు.



శ్రీకాళహస్తిలో దివంగత నేత, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అనుచరుల అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. శ్రీకాళహస్తి- పిచ్చాటూరు మార్గంలో మంచి డిమాండ్ ఉన్న రాజీవ్ నగర్ కాలనీలోని ప్లాట్లను బొజ్జల అనుచరులు ఒక్కొక్కటిగా అమ్ముకుని సొమ్ముచేసుకున్నారు. అసలైన లబ్ధిదారుల సంతకాలను ఫోర్జరీ చేసి విక్రయించుకుంటున్నారు. మంగళవారం రాత్రి శ్రీకాళహస్తిలో అల్లూరయ్య అనే మున్సిల్ ఉద్యోగి నివాసంలో అధికారులు చేపట్టిన సోదాల్లో బయటపడ్డ పట్టాలే ఇందుకు నిదర్శనం.

- మున్సిపల్ ఉద్యోగిని అడ్డుపెట్టుకుని టీడీపీ నేతల అక్రమాలు
- లబ్ధిదారుల సంతకాలు ఫోర్జరీ
- యథేచ్ఛగా పేదల ప్లాట్ల విక్రయం
- 2018 నుంచి మరింత రెచ్చిపోయి అమ్మకాలు

సాక్షి, తిరుపతి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్‌నగర్ కాలనీ పేరుతో ఇల్లులేని పేదలకు గూడు కల్పించాలని నిర్ణయించారు. శ్రీకాళహస్తి- పిచ్చాటూరు మార్గంలో అందుకు అవసరమైన భూములను సేకరించారు. సుమారు 6వేల మంది పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేశారు. పక్కా గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణంతో రాజీవ్ నగర్ అభివృద్ధి అటకెక్కింది. తర్వాత ప్రభుత్వాలు రోడ్లు, తాగునీరు తదితర మౌలిక కల్పించకపోవటంతో అక్కడ ఇల్లు కట్టుకునేందుకు లబ్ధిదారులు సైతం పెద్దగా ఆసక్తి చూపలేదు. అదే సమయంలో హౌసింగ్‌శాఖలో కాంట్రాక్టు కింద పనిచేస్తున్న అల్లూరయ్య మాయమాటలు చెప్పి లబ్ధిదారుల పట్టాలను తీసిపెట్టుకున్నాడు. అరాకొర ధరలకే కొన్ని ప్లాట్లను అమ్ముకుని జేబులో వేసుకున్నాడు. ఈ విషయం అప్పట్లోనే బయటపడడంతో నాటి ప్రభుత్వం వెంటనే అల్లూరయ్యను ఉద్యోగం నుంచి తొలగించింది.

టీడీపీ హయాంలో రెచ్చిపోయి..

టీడీపీ ప్రభుత్వంలో అల్లూరయ్య శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. తొలుత అటెండర్‌గా చేరి అవినీతి పర్వానికి తెరతీశాడు. ఆ సమయంలోనే 30 మంది మున్సిపల్ ఉద్యోగుల పీఎఫ్ సొమ్మును కాజేశాడనే ఆరోపణలతో సస్పెండయ్యాడు. అయితే శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నేత సతీమణికి రూ.20లక్షలు ముట్టజెప్పి, 2018లో అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు. ఇక అప్పటి నుంచి మున్సిపల్ ఆఫీస్‌లో అల్లూరయ్య ఆడింది ఆట.. పాడింది పాటగా మారిపోయింది. అదే సమయంలో అల్లూరయ్య వద్ద ఉన్న ఇంటి పట్టాల విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బొజ్జల అనుచరులు నలుగురు రంగంలోకి దిగారు. లబ్ధిదారుల సంతకాలను ఫోర్జరీ చేసి రూ.100 డాక్యుమెంట్లు సిద్ధం చేసుకున్నారు. దొరికిన స్థలాలను దొరికినట్లు ఇష్టారాజ్యంగా అమ్మేసి సొమ్ము చేసుకున్నారు.

వందలాది పట్టాలు వెలుగులోకి..

రాజీవన్‌నగర్‌లో నాడు రూ.30వేలు ఉన్న ఇంటి స్థలం.. నేడు రూ.5లక్షలకు చేరడంతో అల్లూరయ్య దగ్గర ఉన్న పట్టాలను టీడీపీ నేతలు బయటకు తీయించారు. తాము ఇది వరకే సిద్ధం చేసుకున్న రూ.100 డాక్యుమెంట్‌లను చూపించి కొనుగోలుదారులను బురిడీ కొట్టించడం ప్రారంభించారు. తమకు నగదు అవసరమని, అందుకే రూ.5లక్షల ప్లాటుని రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకే ఇచ్చేస్తున్నామని ప్రచారం చేపట్టారు. ఆ ప్రాంతంలో పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని తక్కువ ధరకే ప్లాటు వస్తుందని స్థానికులు పెద్దసంఖ్యలో కొనుగోలు చేశారు. ఇలా సుమారు వెయ్యి ప్లాట్ల వరకు విక్రయించినట్లు తెలిసింది. ఇవి కాకుండా అల్లూరయ్య ఇంట్లో అధికారులు జరిపిన సోదాల్లో మరో 2,309 పట్టాలు దొరకడం గమనార్హం. టీడీపీలోని నలుగురు నేతలు, అల్లూరయ్య చేస్తున్న అక్రమాలను తెలుసుకున్న మరికొందరు ఆ పార్టీ నాయకులు కూడా ఒక్కొక్కరు 5 నుంచి 10 ప్లాట్ల వరకు ఆక్రమించుకున్నట్లు సమాచారం.

భాగోతం బట్టబయలు!

రాజీవ్‌నగర్‌లో ఇంటి స్థలాలకు రేటు పలకుతుండడంతో అల్లూరయ్య దగ్గర పట్టాలు ఇచ్చిన లబ్ధిదారుల్లో కదలిక వచ్చింది. తమ పట్టాలను వెంటనే ఇవ్వాలని అల్లూరయ్యను కోరారు. అయితే తన వద్ద ఎలాంటి పట్టాలు లేవని తెగేసి చెప్పడంతో ఖంగుతిన్నారు. ఈ విషయాన్ని వెంటనే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి విచారణకు ఆదేశించడంతో బొజ్జల అనుచరుల భాగోతం బట్టబయలైంది.



శ్రీకాళహస్తి సమీపంలోని రాజీవ్‌నగర్ కాలనీ వ్యూ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెరిగిన డిమాండ్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక శ్రీకాళహస్తి- పిచ్చాటూరు మార్గం అభివృద్ధి పథంలో పయనించింది. అక్కడ జగనన్న కాలనీ పేరుతో 2 వేల మందికి పైగా పక్కాఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. లే అవుట్‌ని సుందరంగా తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సైతం ఆ ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నవరత్నాల ఆలయాన్ని నిర్మించారు. జగన్న కాలనీకి ఎదురుగానే ఉన్న రాజీవ్ నగర్‌కి పైన కొండచుట్టు కోసం 'దేవుడి బాట' పేరుతో 20 కిలోమీటర్ల రహదారి ఏర్పాటు చేశారు. కాలనీకి పకడ్బందీగా నీటి సౌకర్యం కల్పించారు. దీంతో రాజీవ్‌నగర్ కాలనీలోని ప్లాట్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది.



అల్లూరయ్య నివాసంలో ఉన్న పట్టాలను పరిశీలిస్తున్న అధికారి. ఈ అరలో ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్ బ్లాకులకు సంబంధించిన పట్టాలు ఉన్నాయి. ఏ బ్లాక్‌లో ప్లాటు ఖాళీగా ఉంటే.. ఇంట్లో బ్లాకుల వారీగా పెట్టి ఉన్న పట్టాలను తీసుకెళ్లి లబ్ధిదారుని సంతకాన్ని ఫోర్జరీ చేసి విక్రయిస్తుంటారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ మైనారిటీ నేతలు



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మైనారిటీ నాయకులు

రొంపిచెర్ల: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో రొంపిచెర్ల–1 టీడీపీ ఎంపీటీసీ సభ్యులు రహీమబీ, పలువురు మైనారిటీ నాయకులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన రహీమబీ, నాయకులు అజంతుల్లా, బారుద్దీన్, హలిమా, మజీమా, అదిల్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం అభ్యున్నతికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించారని పేర్కొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. టీడీపీలో ముస్లింలకు సరైన గుర్తింపు లేదని, అందుకే వైఎస్సార్‌సీపీలో చేరామని స్పష్టం చేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇస్తామని తెలిపారు. కలసి కట్టుగా పార్టీ కోసం పని చేయాలని సూచించారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, నాయకులు బషీర్, చిన్న నాగరాజ, విజయశేఖర్, ఇజాజ్, బుడాన్ సాహెబ్, మస్తాన్ పాల్గొన్నారు.

శోభాయమానం.. పెనుశిల క్షేత్రోత్సవం



స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేద పండితులు



హనుమంత వాహనంపై శ్రీవారు

- సరస్వతీ అలంకరణలో నృసింహుడు
- హంసవాహనంపై దేవదేవుడి కటాక్షం
- హనుమపై విహరించిన శ్రీవారు

రాపూరు : పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బుధవారం సరస్వతీదేవి అలంకరణలో స్వామివారు హంసవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ముందుగా నారసింహుని అలంకార మండపంలో వేంచేపు చేశారు. సుగంధ సుమాలతో విశేషంగా తీర్చిదిద్ది హంసవాహనంపై కొలువుదీర్చారు. ఆలయం నుంచి పారువేట మండపం వరకు క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం ఊంజల్‌సేవ జరిపించారు.

సేదతీరేలా.. తిరుమంజనం

వివిధ సేవలతో అలసిపోయిన శ్రీవారికి సేద తీర్చేందుకు అర్చకులు మధ్యాహ్నం 12 గంటలకు స్నపన తిరుమంజనం జరిపించారు. దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలను పాలు, పెరుగు, తేనె, వివిధ రకాల పళ్లరసాలు, చందనం, పసుపు, కొబ్బరినీటితో అభిషేకించారు. అనంతరం యాగశాలలో లక్ష్మీనారసింహ హోమం నిర్వహించారు.

హనుమపై శ్రీవారు

శ్రీరామచంద్రుని అలంకారంలో ముస్తాబైన నృసింహస్వామివారు రాత్రి బంగారు హనుమవాహనాన్ని అధిష్టించారు. మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పూలంగిసేవ, సింహవాహనసేవ, మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం సహస్రదీపాలంకరణసేవ, రాత్రి గరుడసేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తిరుపాల్‌రెడ్డి, ఈఓ జనార్ధన్‌రెడ్డి తెలిపారు.

ఆగమోక్తం.. అంకురార్పణం

- నేటి నుంచి పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు



పుట్టమన్ను సేకరణకు వెళుతున్న అర్చకులు, అధికారులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు గురువారం నుంచి 6వ తేదీ వరకు పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఆగమోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ క్రమంలో అమ్మవారిని వేకువనే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకై ంకర్యాలు సమర్పించారు. సాయంత్రం 6 గంటలకు యాగశాలలో పుణ్యావచనం, రక్షాబంధనం, హోమ పూజలు నిర్వహించారు. సర్వసేనాధిపతియైన విష్వక్సేనుల వారిని సన్నిధి నుంచి వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకెళ్లి, స్వామి వారి సమక్షంలో అర్చకులు పుట్టమన్ను సేకరించారు. అనంతరం తిరువీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. యాగశాలలో సిద్ధంగా ఉంచిన నవపాళికలలో పుట్టమన్ను నింపి, అందులో నవధాన్యాలు వేసి అంకురార్పణ చేశారు. వసంతోత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజూ మధ్యాహ్నం అమ్మవారికి స్నపన తిరుమంజనం, రాత్రి వీధోత్సవం జరిపించనున్నారు. గురువారం ఉదయం స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆర్జిత సేవలను రద్దు చేశారు. అంకురార్పణ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుభాష్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవం.. మహాకుంభాభిషేకం

తిరుపతి కల్చరల్ : నగరంలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఐదు రోజుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూడోరోజు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసినయాగశాలలో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్విరామంగా వేద పారాయణం, వేద మంత్రోచ్చారణ, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత యాగశాలలో గోసేవతో మహా కుంభాభిషేకం ఆరంభమైంది. అనంతరం శాఖన శుద్ధి, వేదస్వస్తి, మంగళ వాయిద్య ఘోష్టి చేపట్టారు. అనంతరం అమ్మవారికి సుప్రభాతం, ఆవాహనం చేసి సమస్త దేవతా మూర్తులు, యోగినీ ఘనములకు ఉపచార అర్చనలు చేశారు. అనంతరం జల అధివాస అనువాక మంత్రాలను పఠించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంత్ర అనుష్టానం, హోమాలు, అమ్మవారికి పంచగవ్యాధివాసం చేపట్టారు. అందులో భాగంగా ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చెరుకు రసం, నవనీతములు వంటి 32 రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. సాయంత్రం మహామంత్రష్టం, మంగళహారతుల సమర్పణతో మూడోరోజు మహా కుంభాభిషేక పూజలు పరిపూర్ణమయ్యాయి. నాలుగోరోజైన గురువారం మహా కుంభాభిషేక మహోత్సవంలో ఉదయం అమ్మవారికి స్నపనం నిర్వహించనున్నారు. సాయంత్రం ధాన్యాధివాసం చేపడతారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పుష్ప ఆధివాసము, పుష్పోత్సవం, పుష్పయాగం, దీపోత్సవం, సయ్యాధివాసం వంటి ప్రత్యేక పూజలు జరిపించనున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య పాల్గొన్నారు.



గంగమ్మ మూలవిరాట్‌ను తీసుకువస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

జలాధివాసంలో గంగమ్మ తల్లి

తాతయ్యగుంట గంగమ్మతల్లి బుధవారం జలాధివాసంలో కొలువయ్యారు. మహా కుంభాభిషేక యజ్ఞయాగాదులు పరిసమాప్తమైన తర్వాత నవధాన్యాల్లో భద్రత పరిచిన గంగమ్మ తల్లి మూలవిరాట్‌ను వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ యాగశాలకు తీసుకొచ్చి జలంలో కొలువుదీర్చారు. అమ్మవారిని గురువారం ఉదయం మహా కుంభాభిషేక యజ్ఞయాగ మహోత్సంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 70 మంది వేద పండితులకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా నూతన వస్త్రాలను బహూకరించారు.

అఫ్కాన్స్ రూ.5 లక్షల విరాళం



అఫ్కాన్స్ సంస్థ అందజేసిన రూ.5,00,000/-లు విరాళం చెక్కును తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపి యాదవ్ , కార్యనిర్వహణాధికారి ముని కృష్ణయ్యకు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హరిత, కార్పొరేషన్ మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభియన్, ముద్ర నారాయణ తదితరులు.

తహసీల్దార్ల బదిలీ

తిరుపతి అర్బన్ : జిల్లాలో బుధవారం ఏడుగురు తహసీల్దార్లను బదిలీ చేశారు. వారిలో ప్రధానంగా చిన్నగొట్టుగల్లు తహసీల్దార్ బి. హనుమాన్ నాయక్‌ను బీఎన్ కండ్రిగ, అక్కడ పనిచేస్తున్న టీవీ సుబ్రమణ్యాన్ని తిరుపతి రూరల్, ఇక్కడ నుంచి ఎం. లోకేశ్వరిని చిన్నగొట్టుగల్లుకు బదిలీ చేశారు.అలాగే కలెక్టరేట్ ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న పరమేశ్వర స్వామి, తహసీల్దార్ నిత్యానందబాబును సివిల్ సప్లయి తనిఖీ అధికారులుగా నియమించారు.

అంకితభావంతో ప్రజాసేవ

- గడప గడపకు మహా పాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- అడుగడుగునా జననీరాజనం



బైక్ ర్యాలీలో మోహిత్‌రెడ్డి



ఎగవూరు పంచాయతీలో పర్యటిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : అంకిత భావంతో ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు, దిగవూరు పంచాయతీల్లో నిర్వహించిన గడప గడపకు మహా పాదయాత్రకు జనం నీరాజనాలు పలికారు. ఎగవూరు మాజీ సర్పంచ్ దేవప్రసాద్ (బాబీ) ఆధ్వర్యంలో మోహిత్‌రెడ్డి పాదయాత్రకు స్కూటర్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. మోహిత్‌రెడ్డి సైతం స్కూటర్‌ను నడిపి పార్టీ శ్రేణులను, యువతను ఉత్సాహ పరిచారు. పల్లెల్లో పార్టీ శ్రేణులు కండువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మహిళలు హారతులు పట్టి ఆహ్వానం పలికారు. పల్లె ప్రజలు తమ ఇంటికి విచ్చేసిన మోహిత్‌రెడ్డిని ఆప్యాయంగా ఆదరించారు. దిగవూరు పంచాయతీలోని గాండ్లపల్లె, శాంతి నగర్, నగరి, దిగువగాజులవారిపల్లె, కుమ్మరపల్లె, ముక్కేవాండ్లపల్లె, అరికెలవాండ్లలపల్లె, , కొత్తపల్లె, మట్టివారిపల్లె, ఎగవూరు పంచాయతీలోని పాలమాకులపల్లె, మాదిగపల్లె, ఉలసలవాండ్లపల్లె, గాజులవారిపల్లె, గొల్లపల్లె, బొగ్గలవారిపల్లె, తోటైటమాదిగపల్లె, ఈదలచెరువుపల్లెలో ఆయన ఇంటింటికీ వెళ్లారు. ప్రజలతో మమేకమయ్యారు.

మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి చోటా జగనన్న పాలనకు అనూహ్య స్పందన వస్తోందన్నారు. ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో ఎగవూరు, దిగవూరు పంచాయతీల్లో రోడ్లను అద్భుతంగా తీర్చిదిద్దామని వెల్లడించారు. కులమతాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని వివరించారు.

ఎగవూరు, దిగవూరు పంచాయతీల్లో రూ.5.94 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, సర్పంచులు శంకర్‌రెడ్డి, కుమారి, డివిజన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అమరావతి, ఉప సర్పంచ్ ధనలక్ష్మీ , మాజీ సర్పంచ్ బాబీ, బాలచంద్ర, జనార్దన్, మునిచంద్ర, మోహన్, ఉమాపతి, శశి, దిగవూరు పంచాయతీ నాయకులు ఉప సర్పంచ్ రాజేష్, మాజీ ఎంపీపీ డీఎల్ రాజారెడ్డి, హరినాదరెడ్డి, బయారెడ్డి, మాజీ సర్పంచ్ యర్రయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి తరిగొండ వెంగమాంబ జయంతోత్సవాలు

తిరుపతి కల్చరల్ : మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 293వ జయంతి ఉత్సవాలను నేటి నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో గురువారం ఉదయం 10 గంటలకు తొండవాడకు చెందిన కృష్ణారెడ్డి, తిరుపతికి చెందిన డాక్టర్ యువశ్రీ, డాక్టర్ నాగోలు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సాహితీ సదస్సు, సాయంత్రం 6.30 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల గాత్ర సంగీతం జరిపించనున్నారు.అలాగే శుక్రవారం ఉదయం 9 గంటలకు తిరుపతి ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద తరిగొండ వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించనున్నారు. అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10 నుంచి సంగీత సభ, 11.30 గంటలకు హరికథ పారాయణం జరుగనుంది. సాయంత్రం 6.30 గంటలకు ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకుల నృత్య కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే గురువారం తరిగొండ శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో పుష్పాంజలి, గోష్టిగానం, హరికథ జరిపించనున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీలక్ష్మీ నృసింహ స్వామి వారి కల్యాణం, సాయంత్రం సంగీత సభ, హరికథ పారాయణం నిర్వహించనున్నారు.

జనావాసంలోకి జింకలు

– ఒకటి మృతి



జింక కళేబరం

సూళ్లూరుపేట : అటవీప్రాంతం నుంచి దారితప్పిన రెండు జింకలు మంగళవారం రాత్రి పట్టణంలోని కోళ్లమిట్ట ప్రాంతంలోకి వచ్చాయి. ఒక జింక ఓఎస్ కాలనీ ప్రహరీ గోడను దాటే ప్రయత్నంలో కిందపడి మృతి చెందింది. మరో జింకను కుక్కలు తరుముకోవడంతో స్థానికులు రక్షించి పులికాట్ వన్యప్రాణి విభాగం అధికారులకు అప్పగించారు.

జగనన్న వెంటే జనం



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. బుధవారం పట్టణంలోని సనత్‌నగర్‌లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో ఎంపీ భేటీ అయ్యారు. ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని కొనియాడారు. విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారని తెలిపారు. జనరంజకంగా పథకాలను అమలు చేస్తున్నందు వల్లే ఇటీవల నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్, రూరల్ ఎంపీపీ గురవయ్య, నాయకులు విజయమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అమరనాథ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, గఫూర్, నాగరాజు, కిరణ్‌రెడ్డి, బట్టా గోపీయాదవ్, ప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.

8న ఐటీఐ అప్రెంటీస్ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 8న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించ నున్నట్లు ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసినవారు అప్రెంటీస్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చని లేదా నేరుగా హాజరు కావచ్చని తెలిపారు.

ఏసీబీ దాడుల కలకలం?

- బోసిబోయిన సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- అర్ధరోజు సెలవుపై వెళ్లిన సబ్‌రిజిస్ట్రార్

సూళ్లూరుపేట : ఏసీబీ అధికారులు బుధవారం దాడి చేయనున్నారనే సమాచారంతో సూళ్లూరుపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఉలిక్కిపడ్డారు. ఎందుకు వచ్చిన ఇబ్బందిలే అనుకుంటూ సబ్‌రిజిస్ట్రార్ సైతం అర్ధరోజు సెలవు పెట్టి వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే సర్వర్ పనిచేయడంలేదనే సాకు చూపి రిజిస్ట్రేషన్లు ఆపేసినట్లు సమాచారం. దీంతో ఎప్పుడూ జనాలతో రద్దీగా కనిపించే కార్యాలయం ఒక్కసారిగా బోసిబోయింది. కనీసం స్టాంప్ రైటర్లుగా కూడా కనిపించకపోవడం విశేషం. అయితే నిజంగా సర్వర్ పనిచేయలేదా! బాగా పనిచేస్తున్న సర్వర్‌ను పనిచేయకుండా చేశారా! అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఏసీబీ అధికారులు దాడులు జరుగుతాయనగానే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది భుజాలు తడుముకోవడం చూస్తుంటే అక్కడ అవినీతి ఏస్థాయిలో అర్థమవుతోందని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ సింహాద్రినాయుడిని వివరణ కోరగా నిజంగానే సర్వర్ పనిచేయడం లేదని వెల్లడించారు. సబ్‌రిజిస్ట్రార్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సెలవు పెట్టారని వివరించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.3.58లక్షల సొత్తు స్వాధీనం

సత్యవేడు: వివిధ ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను బుధవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సత్యవేడు పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస జరిగిన చోరీలపై సీఐ శివకుమార్, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో తమిళనాడు సరిహద్దులోని ఆర్‌వీఆర్ వే వంతెన వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. చెన్నైలోని కొరుకుపేటకు జీజే నగర్‌కు చెందిన బాషా(23)ను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా పలు ప్రాంతాల్లో జరిగిన చోరీల్లో నిందితుడిగా గుర్తించారు. నిందితుడి నుంచి సుమారు రూ. 3.58 లక్షల బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై సైదాపురం, గూరుడు, మనుబోలు, చిట్టమూరు, ఒజిలి పెళ్లకూరు పోలీస్‌స్టేషన్లతో పాటు, తమిళనాడు కొరుకుపేట పోలీస్ స్టేషన్‌లోనూ పలు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. నిందితుడి అరెస్ట్‌లో కీలకపాత్ర పోషించిన ఎస్ఐ పురుషోత్తం రెడ్డి, ఏఎస్ఐ చంద్రశేఖర్ నాయుడు, హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్, కానిస్టేబుళ్లు నరేష్‌కుమార్, కుప్పారావు, ఎ. శివ, ఆర్ శివను డీఎస్పీ అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



విలపిస్తున్న కుటుంబసభ్యులు (ఇన్‌సెట్) సురేష్ (ఫైల్)

కేవీబీపురం : మండలంలోని మర్రిగుంటకు చెందిన కటారి సురేష్ (28) అనే యువకుడు బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సెంట్రింగ్ పనులు చేసుకుని సురేష్ జీవనం సాగించేవాడు. తిమ్మసముద్రంలో ఓ ఇంటికి సెంట్రింగ్ చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో కుప్పకూలాడు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య గీత ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో సురేష్ క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం గృహసారథిగా సేవలందిస్తున్నాడు. సురేష్ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఫోన్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుడికి కుమారుడు నిశాంత్ (7), కుమార్తె ప్రణీత (5) ఉన్నారు.

అనుమానాస్పదంగా విద్యార్థి..



ప్రణీత్ (ఫైల్)

గూడూరురూరల్ : మండలంలోని తాళ్లమ్మ గుడి వద్ద చల్లకాలువలో పడి అనుమాస్పద స్థితిలో ఓ విద్యార్థి మృతి చెందాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు.. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లికు చెందిన కోకర్ల ప్రసాద్ కుమారుడు ప్రణీత్(22) గూడూరు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం రాత్రి 10 గంటలకు ప్రణీత్ తన లోకేషన్‌ను ఫోన్‌లో స్నేహితులకు షేర్ చేసాడు. దాని ఆధారంగా వారు చల్లకాలువ ప్రాంతానికి వెళితే ప్రణీత్ కనిపించలేదు. దీంతో వారు ప్రణీత్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో అందరూ కలసి బుధవారం ఉదయం చల్లకాలవ ప్రాంతంలో గాలింపు చేపట్టగా ప్రణీత్ సెల్ ఫోన్, ఐడీ కార్డులు గట్టుపై దొరికాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.